సాక్షి
జనగామ

మంగళవారం | 9 | జూలై | 2024



అడవి బిడ్డల పండుగ 'సీత్లా'
బంజారాలు పవిత్రంగా నిర్వహించే మొదటి పండుగ సీత్లా వేడుక . ఆషాఢమాసంలో ఒక మంగళవారం ఎంచుకుని పండుగ చేసుకుంటారు. - 8లో



సహకార సంఘాలు బలోపేతం
కామన్ సర్వీస్ సెంటర్‌ల నిర్వహణతో పీఏసీ ఎస్‌లు మరింత బలోపేతం అవుతాయని టీఎస్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
$31^{0}/26^{0}$

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

నిధులు మంజూరు చేయాలి



పాలకుర్తి: పాలకుర్తి నియోజకవర్గంలో గతంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి, అలాగే కొత్త పనులు చేపట్టడానికి నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డినిపాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రాజేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎంను కలిసి సమస్యలు వివరించగా సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు.

కనుల పండువగా రథయాత్ర



జనగామ: జిల్లా కేంద్రంలో పూరి జగన్నాథ స్వామి రథయాత్ర సోమవారం కనుల పండువగా సాగింది. స్థానిక గీతాశ్రమం హరేకృష్ణ హరేరామ భక్తజన బృందం ఆధ్వర్యంలో చేపట్టిన రథయాత్రను జనగామ బస్టాండు ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, సిద్ధాంతి కృష్ణమాచారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త ప్రారంభించారు. కార్యక్రమంలో ధనుంజయ పండిత్ దాస్, శ్రీసనాతన్ దాస్, సునీల్ ప్రభు, శ్రీకాంత్, సోమిరెడ్డి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులకు విఘాతం కలిగిస్తే చర్యలు



దేవరుప్పుల : బాలల హక్కులకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా చట్టపరంగా కఠిన చర్యలకు తప్పవని చైల్డ్ ప్రొటెక్షన్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ సూర్యప్రకాశ్ అన్నారు. సోమవారం స్థానిక వ్యాపార, వాణిజ్య దుకాణ సముదాయాలను బాలల పరిరక్షణ ప్రత్యేక బృందంతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో అనుమానితులుగా కనబడిన వారి ఆధార్ కార్డు పరిశీలించి వదిలేశారు. వ్యాపార, వాణిజ్య దుకాణాలు, ఇటుకబట్టీలు, రైస్‌మిల్లులు, హోటళ్లలో బాలలను పనిలో పెట్టుకుంటే యజమానులతోపాటు తల్లిదండ్రులకు శిక్ష తప్పదని స్పష్టం చేశారు.

జేఎల్ ఫలితాల్లో శ్రీనివాస్‌కు ఐదో ర్యాంక్



పాలకుర్తి టౌన్: టీజీపీఎస్సీ వెలువరించిన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో పాలకుర్తి మండలం మల్లంపల్లికి చెందిన రాపాక శ్రీనివాస్ ఎకనామిక్స్ విభాగంలో రాష్ట్ర స్థాయి ఐదో ర్యాంక్ సాధించాడు. ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడిగా కొలువు సాధించాడు. పాఠశాల విద్య మండలంలో పూర్తి చేసిన శ్రీనివాస్.. ఇంటర్ హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ పీజీ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పూర్తి చేశాడు. ఆదే యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్రంలో ఎంఫిల్, పీహెచ్‌డీ పట్టా సాధించాడు. జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించడం తనకెంతో తృప్తినిస్తుందని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు.



పక్క ఫొటోలో ఉన్నది జిల్లాలోని వీఆర్‌ఏ ఉద్యోగులు. వారసత్వ ఉద్యోగాల డిమాండ్‌తో గత ఏడాది నెల రోజుల పాటు దీక్షలు చేశారు. డిమాండ్ నెరవేర్చడానికి అప్పటి ప్రభుత్వం సమ్మతించగా.. అభ్యర్థుల జాబితా సిద్ధం చేసి నివేదించడంతో ఉద్యోగాలు కల్పించింది. వయసు 61 ఏళ్లు పైబడిన వారికి కూడా ఇవ్వాలి.. కానీ ఇవ్వలేదు. ఓటా బంద్(ఇద్దరి పొత్తుల) ఉన్నవారు ఉద్యోగం వస్తుందని పాలివారితో ఒప్పందం చేసుకుని భూములు, ఇళ్లు, నగదు ఇచ్చారు. అయితే నేటికీ పర్మనెంట్ ఎంప్లాయ్ ఐడీ ఇవ్వకుండా.. వారసత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా జాప్యం చేస్తున్నారని వారు కలెక్టర్‌కు విన్నవించారు.

విసిగి.. వేసారి

పరిష్కారానికి నోచుకోని అర్జీలు ◆ ఏళ్ల తరబడి కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు

- గ్రీవెన్స్‌లో 63 దరఖాస్తుల స్వీకరణ
- వినతులను త్వరగా పరిష్కరించాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా



గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు

జనగామ రూరల్: ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు.. అర్జీలు అందజేసి కాళ్లు అరిగేలా తిరుగుతున్న దరఖాస్తుదారులు విసుగెత్తిపోతున్నారు. ఇందుకు ఇటీవల చోటుచేసుకుంటున్న ఆత్మహత్యాయత్నం ఘటనలే నిదర్శనం. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్‌కు వివిధ సమస్యలపై 63 దరఖాస్తులు రాగా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్ కుమార్, వివిధ విభాగాల అధికారులు స్వీకరించారు. వచ్చిన అర్జీల్లో అధిక శాతం భూమి సంబంధ, దివ్యాంగుల సమస్యలు ఉన్నాయి. దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సమస్యలు త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పోలీసుల తనిఖీ..

సమస్యలు పరిష్కారం కాకపోవడంతో విసుగెత్తిన పలువురు కలెక్టరేట్‌లో కొన్ని వారాల నుంచి ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు దరఖాస్తుదారులను తనిఖీ చేసి లోనికి పంపిస్తున్నారు. 'తనకు పింఛన్ మంజూరు చేయడంలేదని' దివ్యాంగుడైన బాధితుడు సోమవారం పెట్రోల్ బాటిల్‌తో కలెక్టరేట్‌కు రావడం గమనార్హం. అధికారులు గుర్తించి వెంటనే అతడి వద్ద ఉన్న పెట్రోల్ బాటిల్ తీసుకున్నారు.

మీ-సేవ మంజూరు చేయాలి



నేను గ్రామంలోని అభ్యుదయ వీఓలో సభ్యురాలిని. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా శక్తి మీసేవ కేంద్రానికి దరఖాస్తు చేసుకున్నాను. డిగ్రీ పూర్తి చేసి కంప్యూటర్ సర్టిఫికెట్ కలిగిన నన్ను కాదని అన్ని విధాలుగా ఆర్థికంగా ఉన్న వారికి అవకాశం కల్పించారు. నాకు ఎలాంటి ఆస్తుపాస్తులు లేవు. జీవనోపాధికి మీ-సేవ మంజూరు చేసి ఆదుకోవాలి.

- పెంట శ్వేత, కోమళ్ల(రఘునాథపల్లి)

న్యాయం చేయాలి



గ్రామంలోని 125/2, 3 సర్వే నంబర్లలో నాకు ఎకరం 15 గుంటల భూమి ఉంది. భర్త సోమయ్య పేరు మీద అత్తమామలు పట్టా చేసి ఇచ్చారు. ఐదేళ్ల నుంచి కాస్తులో ఉండి జీవిస్తున్నాను. మూడేళ్ల నుంచి గ్రామానికి చెందిన కొందరు భూమి ఆక్రమించి బెదిరించి సాగు చేస్తున్నారు. పోలీసుల సహాయంతో పంటలు వేయగా ధ్వంసం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. న్యాయం చేయాలి.

- బండిపల్లి యాకలక్ష్మి, లక్ష్మీనారాయణపురం(పాలకుర్తి)

ఆర్థిక సాయం ఇప్పించాలి



నా భర్త బోశెట్టి వెంకటేశ్వర్లు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాడు. స్వరాష్ట్రం కోసం ఒంటికి నిప్పంటించుకొని ప్రాణాలు అర్పించాడు. అప్పటి ప్రభుత్వం అమరవీరుల పథకం ద్వారా రూ.10 లక్షల పరిహారం అందిస్తామని చెప్పగా దరఖాస్తు చేసుకున్నా. జాబితాలో భర్త పేరు ఉన్నా నేటికీ మంజూరు కాలేదు. ఆర్థిక సాయం ఇప్పించాలి.

- బోశెట్టి శోభ, బచ్చన్నపేట

రాష్ట్ర సేవలకు అవకాశం ఇవ్వాలి



మీ–సేవలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన నగదు రహిత లావాదేవీలు, వివిధ పథకాలకు సంబంధించి డిజిటల్ సేవలకు లాగిన్ బోర్డులు ఇచ్చారు.. అయితే రాష్ట్ర ప్రభుత్వం పౌరసేవలను ఆన్‌లైన్ అప్లికేషన్ చేసే అవకాశం కల్పించలేదు. తమకు రాష్ట్ర సేవలకు అవకాశం ఇచ్చి జీవనోపాధికి తోడ్పాటు అందించాలని మీసేవ యజమానులు కలెక్టర్‌ను కోరారు.

స్పౌజ్ సమస్య పరిష్కరించాలి



స్టేషన్‌ఘన్‌పూర్‌లోని తాటికొండ సోషల్ వెల్ఫేర్‌లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న నేను డిప్యుటేషన్‌పై జఫర్‌గఢ్ ఎస్సీబాలుర హాస్టల్‌లో పని చేస్తున్నాను. నా భార్య జన్ను ఎలిషా నర్సంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తోంది. గత ప్రభుత్వం జారీ చేసిన స్పౌజ్ 317 జీఓ కింద నాకు వరంగల్ ఎస్సీ డెవలప్‌మెంట్ డిపార్ట్ మెంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయాలని 2013లో దరఖాస్తు చేసుకున్నాను. సీనియర్ అసిస్టెంట్ నోట్ ఫైల్ పెట్టకుండా జాప్యం చేస్తున్నాడు. స్పౌజ్ సమస్య పరిష్కరించాలి.

- పసునూరి స్వామి, వాచ్‌మెన్, తాటికొండ సోషల్ వెల్ఫేర్

వైఎస్సార్‌కు ఘన నివాళి



వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కడియం, ఎంపీ కావ్య తదితరులు

దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా వ్యాప్తంగా అభిమానులు, కాంగ్రెస్, వైఎస్సార్ సీపీ నాయకులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్‌లు కట్ చేసి ఆస్పత్రుల్లో రోగులకు, పేదలకు బ్రెడ్, పండ్లు, విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కండియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య పాల్గొని మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలుతో వైఎస్సార్ ప్రజల గుండెల్లో స్థిరంగా నిలిచిపోయారని పేర్కొన్నారు. **- జనగామ**

మరిన్ని చిత్రాలు 9లో...

'కడియం' జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

లింగాలఘణపురం: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి జన్మదిన వేడుకలను సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొల్లూరి శివకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ విజయ్‌మనోహర్, నాయకులు పోరెడ్డి మల్లారెడ్డి, బిట్ల బాబు, ప్రవీణ్, అనిల్, భాస్కర్‌రెడ్డి, శంకరయ్య, మోహన్ పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు చేపట్టాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: నూతన ఆవిష్కరణలు చేపట్టి జిల్లా కీర్తిని ఇనుమడింపజేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి 'ఇంటింటా ఇన్నోవేటర్' కార్యక్రమంపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రదర్శించే గ్రామీణ, వ్యవసాయరంగం, సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు తదితర నూతన ఆవిష్కరణల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దీనిపై విద్యాశాఖ, వివిధ శాఖల అధికారులు పాఠశాలలు, గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుత సంవత్సరం గ్రామీణ, పట్టణ ఔత్సాహికులు ఆవిష్కరణలతో ప్రతిభకు పదును పెట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆవిష్కరణ పేరు, ప్రదర్శనకు సంబంధించి రెండు నిమిషాల నిడివి కలిగిన వీడియో, ఆవిష్కరణలకు సంబంధించిన 4 ఫొటోలు, 100 పదాలతో రాసి, పేరు, వయస్సు, ఫొటో, వృత్తి, గ్రామం, జిల్లా పేరు వివరాలతో ఆగస్టు 3లోపు తెలంగాణ ఇన్నోవేషన్ సెల్‌కు పంపాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, డీఆర్‌డీఓ మొగులప్ప, డీఈఓ రాము, ఈడీఎం దుర్గారావు, డీపీఆర్‌ఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

ప్రభుత్వ కార్యాలయాల్లో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. సోమవారం ప్రజావాణి అనంతరం స్థానిక గ్రీవెన్స్, సీఎం గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కారం, ప్రభుత్వ కార్యాలయాల్లో శానిటేషన్, ధరణి, రిజిస్ట్రేషన్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డులను జాగ్రత్తగా భద్రపరచాలని, రిజిస్ట్రేషన్లు ఏరోజుకారోజు చేపట్టాలని నోడల్ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల అడ్మిషన్ కౌన్సిలింగ్ తదితరాలకు ఓబీసీ, కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో జారీ చేయాలన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు, అధికారులు

ఉపాధ్యాయులు మార్గదర్శకులు

విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే మార్గదర్శకులు ఉపాధ్యాయులని, ఉత్తమ బోధనకు పక్కా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం పట్టణంలోని ఏకశిల కళాశాలలో విద్యాశాఖ ఆధ్వర్యాన విద్యా వార్షిక ప్రణాళికపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. విద్యార్థుల ప్రతిభను బట్టి ఏబీసీ కేటగిరీలుగా విభజించి.. అందరినీ ఉన్నతులుగా తీర్చిదిద్దేలా కృషి చేయాలన్నారు. నాణ్యమైన బోధన, పౌష్టికాహారం అందించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు, క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం వంటి పోటీలు నిర్వహించాలన్నారు. డీఈఓ రాము, పరీక్షల అధికారి చంద్రభాను పాల్గొన్నారు.

చీటకోడూర్ వాగుపై బ్రిడ్జి నిర్మించాలి

వర్షం పడితే రోడ్డు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.. తక్షణం చీటకోడూర్ వాగుపై బ్రిడ్జి నిర్మించాలని బ్రిడ్జి సాధన సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. కరుణాకర్, వెంకటేష్, మౌనిక, సంపత్, చిరంజీవి, కమలాకర్, ప్రవీణ్, కార్తిక్, రాజేష్, వంశీ పాల్గొన్నారు.

'స్పౌజ్' బదిలీల దుర్వినియోగం..?

- విచారణకు ప్రభుత్వ ఆదేశం
- ఉపాధ్యాయ సంఘాల్లో చర్చ

జనగామ: ఉపాధ్యాయ బదిలీల్లో స్పౌజ్(భార్యాభర్తలు ఒకేచోట పని చేసేందుకు) పాయింట్ల అంశం విద్యాశాఖను కుదిపేస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా స్పౌజ్ పాయింట్ల వినియోగంపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ మేరకు మరోమారు వెరిఫికేషన్ నిర్వహిస్తున్నారు. జిల్లాలో డీఈఓ రాము ఆదేశాల మేరకు పూర్తి డాటా సేకరిస్తున్నారు.

మానవీయ కోణంలో అవకాశం..

భార్యాభర్తలు ఇద్దరు ఉద్యోగులై ఉండి, వేర్వేరు ప్రాంతాల్లో పనిచేయడంతో కుటుంబ పరంగా ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశంతో ప్రభుత్వం మానవీయ కోణంలో స్పౌజ్ పాయింట్ల పద్ధతిని తీసుకువస్తూ జీఓ జారీ చేసింది. దీని ద్వారా బదిలీ సమయంలో భార్యాభర్తల్లో ఒకరు అదనంగా 10 పాయింట్లు పొందుతారు. స్పౌజ్ కోటాలో బదిలీ అయ్యే భర్త లేదా భార్య పని చేస్తున్న సమీప చోటుకు వెళ్లాలనే స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అయితే.. ఆ ఉత్తర్వులను ఆసరా చేసుకున్న కొంతమంది అదనపు పాయింట్స్ పొందిన వారు దీనికి భిన్నంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. స్పౌజ్ పనిచేసే మండలాల పరిధిలో ఖాళీలు ఉన్నప్పటికీ అదనపు హెచ్‌ఆర్‌ఏ ఉన్న ప్రదేశంతో పాటు తమకు నచ్చిన చోటికి వెళ్లారనే సమాచారం మేరకు విద్యాశాఖ క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహిస్తోంది. జీఓ ఉత్తర్వులను ఉల్లంఘించడం వల్ల సహచర ఉపాధ్యాయులు అవకాశాలు కోల్పోయేలా చేశారనే చర్చ జరుగుతోంది. ఇటీవల జిల్లాలో 422 మంది ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీలు జరగ్గా.. ఇందులో 45 మంది ఎస్జీటీలు, 25 మంది స్కూల్ అసిస్టెంట్లు స్పౌజ్ పాయింట్ల ద్వారా ఆయా పాఠశాలలకు వెళ్లారు. అయితే జిల్లాలో స్పౌజ్ పాయింట్ల ద్వారా అడ్డదారిలో బదిలీలు జరిగాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతుండగా.. ఉపాధ్యాయ సంఘాల్లో చర్చ జరుగుతోంది. జిల్లాలో స్పౌజ్ పాయింట్లతో బదిలీ అయిన ఉపాధ్యాయుల జాబితాను పరిశీలిస్తున్నారు. అక్రమంగా వినియోగించినట్లు తేలితే ఆ బదిలీని రద్దుచేసి తక్షణమే వారిని మిగిలిన ఖాళీ స్థానాల్లో(లెఫ్టోవర్ వేకెన్సీ) నియమించాలని పలు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.



సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు

అతి తెలివితో దుర్వినియోగం..



మానవతా దృక్పథంతో ఇచ్చిన స్పౌజ్ బదిలీ అవకాశాన్ని కొందరు అతి తెలివితో దుర్వినియోగం చేస్తున్నారు. ఉత్తర్వులకు భిన్నంగా నచ్చిన చోటుతో పాటు పట్టణ సమీప పాఠశాలలు, అధిక హెచ్‌ఆర్‌ఏ ఉన్న స్కూళ్లకు బదిలీ కోరుకుని స్పౌజ్ అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. దీనివల్ల అర్హులైన సీనియర్ ఉపాధ్యాయులు, స్పౌజ్ అవకాశం లేని మహిళా ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బదిలీ పొందిన వారితోపాటు సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- డి.శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

సమగ్ర విచారణ చేపట్టాలి..



స్పౌజ్ బదిలీలపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలి. 2023 సంవత్సరం ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లలో 20వేల మందికి లాభం చేకూరింది. కొంతమంది ఉపాధ్యాయులు స్పౌజ్ విషయంలో 10 పాయింట్లు ఉన్నాయని ప్రభుత్వ ఉత్తర్వులను ఓవర్‌టేక్ చేసి అధికారులను తప్పుదారి పట్టించి అత్యధిక హెచ్‌ఆర్‌ఏ ఉన్న ప్రదేశాలకు బదిలీ అయ్యారు. ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలి.

- బి.చొక్కయ్య, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఎలాంటి అక్రమాలూ జరగలేదు..



జిల్లాలో స్పౌజ్ బదిలీల్లో ఎటువంటి అక్రమాలు జరగలేదు. అయితే ఎవరెవరు స్పౌజ్ ద్వారా బదిలీ అయ్యారనే సమాచారం మేరకు సమగ్ర విచారణ చేపడుతున్నాం. రాత్రి వరకు విచారణ పూర్తవుతుంది. బదిలీల సమయంలో అన్ని వివరాలను పరిశీలించిన తర్వాతనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చాం.

- రాము, డీఈఓ

ఎస్సారెస్పీ స్టేజ్-2పై నీలినీడలు

సీఎం ప్రత్యేక దృష్టితో కదలిక వచ్చేనా?

- రూ.22 కోట్లు ఇస్తేనే చివరి ఆయకట్టుకు నీరు
- నిధులపై ఇప్పటికే నీటి పారుదలశాఖ నివేదిక
- మూడు పూర్వ జిల్లాలకు ఎస్సారెస్పీ స్టేజ్-2

సాక్షిప్రతినిధి, వరంగల్:

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు-2 పనులు గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు కేటాయించని కారణంగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు ప్రయోజనం కలిగించే ఈప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈనేపథ్యంలో.. రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న పలు సాగునీటి ప్రాజెక్టులను వీలైనంత త్వరగా వినియోగంలోకి తేవడం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే నిధులు ఖర్చు పెట్టినవి, ఆగిపోయినవి, గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన సాగునీటి ప్రాజెక్టులను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అధికారులను ఆదేశించారు. దీంతో ఎస్సారెస్పీ స్టేజ్-2లో పెండింగ్ పనులకు మోక్షం కలగనుందన్న అభిప్రాయాన్ని ఇంజనీరింగ్ అధికారులు వ్యక్తం చేస్తున్నారు.



పనులు నిలిచిపోయిన ఎస్సారెస్పీ కాల్వ

రూ.22 కోట్ల పనులకు ప్రతిపాదనలు

ఎస్సారెస్పీ స్టేజ్-2 కింద పూర్వ వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో 4.40 లక్షల ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా.. 2006 ఫిబ్రవరిలో రూ.1,043.14 కోట్ల అంచనాలతో పనులు చేపట్టారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద (284 కి.మీ.ల వద్ద) నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గం గరిడేపల్లి వరకు ఎస్సారెస్పీ స్టేజ్-2 పరిధి వస్తుంది. మొత్తం దాదాపుగా పూర్తయి కొద్ది పాటి పనులు నిలిచిపోయాయి. ఎస్సారెస్పీ స్టేజ్-2తో పాటు గోదావరి బేసిన్‌లో ఉన్న నీలం వాగు, పింప్రి ప్రాజెక్టు, పాలెంవాగు, మత్తడి వాగు, సదర్మట్ ప్రాజెక్టులకు సంబంధించిన పనులు పూర్తి చేసేందుకు దాదాపు రూ.241 కోట్లు ఖర్చవుతుందని, వీటి ద్వారా 48వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుందని నీటిపారుదల శాఖ అంచనా వేసింది. దీంతో తక్కువ నిధులతో పూర్తయ్యే ప్రాజెక్టులపై నివేదిక ఇచ్చిన నీటిపారుదలశాఖ ఎస్సారెస్పీ స్టేజ్-2 పనులకు రూ.22.22 కోట్లు ఖర్చవుతుందని పేర్కొన్నారు. ఆ నిధుల విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సీఎం.. మార్చి 2025 నాటికి వందశాతం పనులు పూర్తవ్వాలని ఆదేశించినట్లు అధికారులు చెబుతున్నారు.

పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి..

నీటిపారుదలశాఖ ఇటీవల సమర్పించిన నివేదిక ప్రకారం.. డీబీఎం 53,54, 57, 60లలో 10 చోట్ల 6ఆర్, 7ఎల్‌లతో పాటు కొన్ని మైనర్లు, సీసీ లైనింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో డీబీఎం-60 (తొర్రూరు సమీపం) పనులు ప్యాకేజీ-53 కింద ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) టెండర్ పొందిన కాంట్రాక్టు ఏజెన్సీ రూ.65.71 కోట్ల పనులు రూ.79.47 కోట్ల రివైజ్డ్ ఎస్టిమేట్‌తో అగ్రిమెంట్ చేసుకుని రూ.70.36 కోట్ల బిల్లులు తీసుకుని 88.53 శాతం పనులే చేసింది. ఇలా అన్ని పనులకు రూ.149.49 కోట్ల అంచనాతో చేపట్టిన ఈ పనుల అంచనా వ్యయం రివైజ్డ్ ఎస్టిమేట్‌ల ద్వారా రూ.173.16 కోట్లకు పెరిగింది. ఈపనులకు ఇప్పటి వరకు రూ.152.82 కోట్లు ఖర్చు కాగా.. మిగిలిన పనులు పూర్తి చేయడం కోసం మరో రూ.20.22 కోట్లు అవసరం ఉందని అధికారులు నివేదికలో పేర్కొన్నారు. కొద్దిపాటి నిధులతో పూర్తయ్యే ఆరు ప్రాజెక్టులపై సీఎం దృష్టి సారించిన నేపథ్యంలో ఎస్సారెస్పీ స్టేజ్-2 పనులు పూర్తయ్యే అవకాశం ఉందన్న ఆశాభావం అధికారులు, ఆయకట్టు దారుల్లో వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

చిట్టీలతో మోసం.. నలుగురి అరెస్ట్

వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్ మల్లయ్య



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఇన్‌స్పెక్టర్ మల్లయ్య

ఖిలా వరంగల్: ప్రభుత్వ అనుమతులు లేకుండా చిట్టీలు, మహాలక్ష్మీ పరపతి సంఘం పేరుతో 275 మంది నుంచి నెలవారీగా సుమారు రూ.5కోట్లు సేకరించి పరారైన నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వరంగల్ రైల్వేగేట్ పెరకవాడకు చెందిన పుప్పాల రాజేందర్, అతడి కుమారుడు అనురాగ్, భార్య శ్రీలత, కుమార్తె ప్రణవీ.. ప్రభుత్వ అనుమతులు లేకుండా పాట చిట్టీలు, మహాలక్ష్మీ పరపతి సంఘం పెట్టి 275 మంది సభ్యుల నుంచి సుమారు రూ.5కోట్లు పైగా సేకరించి కుటుంబ సమేతంగా రాత్రికి రాత్రే పరారయ్యారు. దీనిపై వరంగల్ గిర్మాజీ పేటకు చెందిన పెంచాల రంజిత్ కుమార్.. రాజేందర్‌తోపాటు అతడి కుటుంబ సభ్యులపై మిల్స్‌కాలనీ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి పెరకవాడలోని ఇంట్లోనే నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

బస్సు డ్రైవర్‌పై యువకుడి దాడి

రఘునాథపల్లిలో ఘటన

రఘునాథపల్లి: హారన్ కొడుతూ ఓవర్ టేక్ చేసే క్రమంలో బస్సు డ్రైవర్‌ను చూస్తూ కారు నడుపుతున్న యువకుడు ఎగతాళి చేసిన వివాదం పరస్పర దాడుల వరకు వెళ్లిన సంఘటన మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. టీజీఎస్ ఆర్టీసీకి చెందిన వరంగల్-1 డిపోకు చెందిన గరుడ బస్సు హనుమకొండ నుంచి ప్రయాణికులతో హైదరాబాద్ వెళ్తోంది. రఘునాథపల్లి దాటాక ముందు వెళ్తున్న కారు కొద్ది దూరం వరకు బస్సుకు సైడ్ ఇవ్వలేదు. హారన్ కొడుతూ ఓవర్ టేక్ చేసే క్రమంలో కారు నడుపుతున్న యువకుడు బస్సు డ్రైవర్‌ను చూస్తూ ఎగతాళి చేశాడు. దీంతో బస్సును డ్రైవర్ పక్కన ఆపాడు. యువకుడు కారు నుంచి దిగడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా పరస్పరం దాడి చేసుకున్నారు. యువకుడి దాడిలో బస్సుడ్రైవర్‌కు గాయం కాగా ప్రయాణికులు యువకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలికి వెళ్లిన పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఘర్షణ నేపథ్యంలో సుమారు పావుగంటకుపైగా బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ గొడవపై ఎస్సై నరేశ్‌ను వివరణ కోరగా బస్సుడ్రైవర్ ప్రయాణికులతో హైదరాబాద్‌కు వెళ్లాడని, అతను వచ్చి ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

సంప్రదాయ దుస్తుల్లో సీత్లా వద్దకు వెళ్తున్న బంజారాలు (ఫైల్)



అడవి బిడ్డల పండుగ సీత్లా

నేడు గొడ్లదాటుడు(దాటోడి) వేడుక

- నైవేద్యంగా బెల్లన్నం సమర్పణ
- ఆషాఢ మాసంలో బంజారాల తొలిపండుగ

సీత్లా ఉత్సవ విగ్రహాలు



బంజారాలు పవిత్రంగా నిర్వహించే మొదటి పండుగ సీత్లా పండుగ.. బంజారాల సంప్రదాయం ప్రకారం ఆషాఢ మాసంలో తొలకరి విత్తనాలు వేసిన తర్వాత సీత్లా భవానీ పండుగను నిర్వహిస్తారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సీత్లా భవానీ కాపాడుతుందని బంజారాల విశ్వాసం. పశు సంపద వృద్ధి చెందాలని.. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని.. అటవీ సంపద తరగకూడదనీ సీత్లా మాతకు మొక్కులు చెల్లిస్తారు. తండాల్లో జీవనం సాగిస్తున్న వారిలో పెద్ద మనిషితో చర్చించి ఆషాఢంలో ఒక మంగళవారం ఎంచుకుని సీత్లా పండుగను నిర్వహిస్తారు. ఈ పండుగను ఏటా మంగళవారం రోజు మాత్రమే నిర్వహించడం ఆనవాయితీ. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు తండాలలో నేడు (మంగళవారం) సీత్లా భవానీ పండుగను జరుపుకుంటారు.

\- హన్మకొండ కల్చరల్

బంజారాలు సంచారజీవులు..

పూర్వం బంజారాలు సంచార జీవనం సాగించేవారు.. రాజ వంశీయులైన వీరి ప్రధాన వృత్తి వ్యాపారం. ప్రపంచంలోని ఒక్కో తెగకు ఉన్నట్లే వీరికి ప్రత్యేక ఆచార, వ్యవహారాలు భిన్నంగా ఉన్నాయి. ప్రాచీన కాలంలో ముత్యాలు, రత్నాలు, ఉప్పు, జొన్నలు విరివిగా దొరికేవి.. దీంతో వీటిని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రవాణా చేస్తూ విక్రయిస్తుండేవారు. వాహనాలు లేకపోవడంతో ఎండ్ల బండినే ఉపయోగించి, వీరి సంచారం జీవనం గడిపేవారు. ఇందులో భాగంగానే ఎడ్లబండికి పశువులు అవసరం. అయితే ప్రాంతాలు మారుతున్న చోట తరచూ రోగాలబారిన పడి పశువులు మృత్యువాత పడేవి. ఈ క్రమంలో ఓ రోజు తండా పెద్ద (నాయక్) కలలో సీత్లా భవానీ ప్రత్యక్షమై తనను ప్రతిష్ఠించి పూజలు చేస్తే పశువులకు రోగాలు రాకుండా కాపాడుతానని వాగ్దానం చేస్తుంది. నాటి నుంచి నేటి వరకు మంగళవారం రోజు సీత్లా మాతను పూజిస్తారు.

సీత్లా భవానీ చరిత్ర..

దివి నుంచి భువికి దిగి వచ్చిన ఏడుగురు దేవతల్లో మేరమా, తోల్జా, మంత్రళ్, కంకాళి, హింగ్లా, ద్వాళంగర్‌లలో చిన్నామే సీత్లా మాత. వీరికి ఓ తమ్ముడు లుంక్డియా ఉన్నాడు. ఏడుగురు దేవతల్లో అరుగురిని ఇంట్లోనే ప్రతిష్ఠించి పూజిస్తారు. కానీ అందరికన్నా చిన్నదైన సీత్లా భవానీని మాత్రం అడవిలో పూజిస్తారు. ఇందుకు కారణం సీత్లామాత, లుంక్డియా ఓసారి అడవిలో పశువులను మేపేందుకు వెళ్లి దారి తెలియక మాయమైపోయారు. సీత్లా మాత అక్కడే రాయిగా మారిందని పూర్వీకులు చెబుతారు. అందుకే సీత్లాను అడవిలోనే పూజించే ఆచారం తరతరాలుగా వస్తుంది.

తండా పొలిమేరలో సీత్లా మాత ప్రతిష్ఠ..

తండా సరిహద్దు పొలిమేర వద్ద సీత్లా భవానీని శాస్త్రీయంగా ప్రతిష్ఠిస్తారు. గిరిజన వేషధారణలతో మహిళలు పాటలు పాడుతూ.. డప్పు వాయిద్యాలు నడుమ నృత్యాలు చేస్తూ సీత్లా ప్రతిష్ఠ ప్రదేశానికి చేరుకుంటారు. అక్కడ పూజ సమయంలో మహిళల పాటల్లో ప్రకృతి, వ్యవసాయ, పశు సంపదపై వారికున్న అనుభవాలను పాటల రూపంలో కనబడుతుంది. అనంతరం నవధాన్యాలను పశువుల మీద చల్లి దాటించి, తండా వాసులందరూ బాగుండాలని సీత్లా భవానీకి మొక్కులు చెల్లిస్తారు.

సంప్రదాయ నైవేద్యం, పూజలు

పొలిమేరలో ప్రతిష్ఠించిన సీత్లా మాతను బంజారాలు భక్తిశ్రద్ధలతో దర్శించుకుని సాంప్రదాయంగా పూజలు చేస్తూ, పాటలు పాడుతూ నృత్యాలు చేస్తారు. మేకలను బలిచ్చి వాటి పేగు పైనుంచి పశువులను దాటిస్తారు. దీనిని గొడ్ల దాటుడు (దాటోడి) అని పిలుస్తారు. పండుగ రోజు ఊరికి దూరంగా ఏర్పాటు చేసిన రాళ్లను పూలతో అలంకరించి తమ ఇళ్లలో ముందు రోజు నానబెట్టిన జొన్నలు, నవధాన్యాలు గుగ్గిళ్ల వంటి నైవేద్యం వండుతారు. ఇంట్లో తయారుచేసిన బెల్లన్నం(లాప్సీ) గంగాజలంతో పూజలు చేస్తారు. ఉల్లిపాయ, ఎండు మిర్చి కానుకలు సమర్పిస్తారు.

బంజారాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలి



బంజారాలకు సీత్లాభవానీ పండుగ ప్రత్యేకం. బంజారాల పండుగలపై వారి ఆచార సాంప్రదాయాలను వెలికితీసే విధంగా పరిశోధనలు జరగాల్సి ఉంది. బంజారాలకు పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో అవకాశాలు కల్పించాలి. వారి పండుగలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారికి తగిన సదుపాయాలు, చేయూత ఇవ్వాలి.

\- భూక్య బాబురావు, పీఠాధిపతి, జానపద గిరిజన విజ్ఞాన పీఠం, వరంగల్

అధికారిక సెలవు దినంగా ప్రకటించాలి



తెలంగాణలో దాదాపు బంజారాలు 50లక్షల మంది పైగా ఉన్నారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన బంజారాలను ప్రభుత్వం గుర్తించాలి. ప్రత్యేక రోజు అనేది లేకుండా బంజారాలు వారికి వీలైన రోజుల్లో సీత్లా భవానీ పండుగను నిర్వహించుకుంటున్నారు. ఈ పండుగను రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు జరుపుకునేలా తీర్మానించాం. సేవాలాల్ మహారాజ్ జయంతి రోజును రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సెలవు దినంగా ప్రకటించింది. సీత్లాభవానీ పండుగ రోజునూ ప్రభుత్వం అధికారికంగా సెలవు దినంగా ప్రకటించాలి.

\- బానోత్ నవీన్ నాయక్, సీత్లా భవానీ పండుగ ఉత్సవ కమిటీ, రాష్ట్ర అధ్యక్షుడు, పర్షనాయక్ తండా, నర్సంపేట

ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్

- రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ల నియామకంపై ఉత్తర్వులు
- ఉమ్మడి వరంగల్ నుంచి నలుగురికి ఛాన్స్...
- 'కుడా' చైర్మన్‌గా వెంకట్రామ్‌రెడ్డి, జంగా రాఘవరెడ్డికి 'ఆయిల్ సీడ్స్'..
- ప్రకాశ్‌రెడ్డికి 'వాణిజ్యం', బెల్లయ్యనాయక్‌కు ఎస్టీ కార్పొరేషన్..

సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవుల పంపకానికి అధికారికంగా శ్రీకారం చుట్టింది. తెలంగాణ వ్యాప్తంగా 35 కార్పొరేషన్ల చైర్మన్ల నియామకానికి ఎట్టకేలకు సోమవారం జీఓ విడుదల చేసింది. వాస్తవానికి మార్చి 15వ తేదీనే ఈ నియామకాలపై స్పష్టత వచ్చినప్పటికీ.. లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నియమాకాల ప్రక్రియ ప్రకటనకు అడ్డంకిగా మారింది. ఎట్టకేలకు సుమారు 100 రోజుల తర్వాత సీఎస్ శాంతికుమారి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ల నియమాక ఉత్తర్వులు అధికారికంగా విడుదల చేశారు. దీంతో ఉమ్మడి వరంగల్‌లోని నలుగురు కాంగ్రెస్ పార్టీ నాయకులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం దక్కింది.

ఉమ్మడి జిల్లా నుంచి ఏడుగురికి 'నామినేటెడ్'..

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నియామక ఉత్తర్వుల్లో 35 మందిలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఆరుగురు సీనియర్లకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల చైర్మన్ పదవులు దక్కాయి. ఆరు పదవుల్లో ఐదు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లు కాగా, ఒకటి జిల్లాస్థాయి పదవి ఉంది. మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు ఉమ్మడి ఖమ్మం జిల్లా కోటాలో పదవి దక్కింది. సీనియర్ కాంగ్రెస్ నేత జంగా రాఘవరెడ్డికి ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. అదే విధంగా ఎండీ.రియాజ్‌కు తెలంగాణ గ్రంథాలయ పరిషత్, పరకాల నుంచి ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డికి కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) చైర్మన్ పదవులు దక్కాయి. గత ఎన్నికల్లో జంగా రాఘవరెడ్డి, ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి ఎమ్మెల్యే టికెట్ ఆశించగా.. అధిష్ఠానం నిర్ణయం మేరకు అనూహ్యంగా పోటీ నుంచి తప్పుకున్నారు. అదే విధంగా జయశంకర్ భూపాలపల్లి డీసీసీ అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి వాణిజ్య ప్రోత్సాహక కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులు కాగా, మహబూబాబాద్ జిల్లా నుంచి టికెట్ ఆశించిన బెల్లయ్య నాయక్‌కు తెలంగాణ గిరిజన సహకార సంస్థ చైర్మన్‌గా ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో సుమారు నాలుగున్నర నెలల క్రితం తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను కలుపుకుని ఉమ్మడి వరంగల్ నుంచి మొత్తం ఏడుగురికి నామినేటెడ్ పదవులు దక్కినట్లయ్యింది.

ఆశావహులకు మళ్లీ నిరాశే..

మార్చిలో నియామక ఉత్తర్వులకు బ్రేక్ పడిన సమయంలో.. మార్పులు, చేర్పులకు అవకాశం ఉందనే ప్రచారంతో ఉమ్మడి వరంగల్ నుంచి ప్రయత్నాలు చేసుకున్న పలువురు సీనియర్లకు నిరాశే ఎదురైంది. ఈసారి వెలువడిన ఉత్తర్వులు కూడా పలువురు సీనియర్లను అసంతృప్తికి గురి చేశాయి. పలువురు సీనియర్లు.. అనూహ్యంగా పోటీ నుంచి తప్పుకోవాల్సి వచ్చిన నేతలు, ఎమ్మెల్యేగా ఓటమి చెందిన వారికి ఈ జాబితాలో ప్రాధాన్యం దక్కకపోవడం చర్చనీయాంశమవుతోంది. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి ఎమ్మెల్యేలుగా పోటీ చేసి ఓటమి చెందిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, సింగాపురం ఇందిర, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వర్ధన్నపేట టికెట్ ఆశించిన నమిండ్ల శ్రీనివాస్, సీనియర్ నేతలు ఈవీ శ్రీనివాస్‌రావు, పెరుమాండ్ల రామకృష్ణ, బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, కూచన రవళిరెడ్డి, జాలి కమలాకర్ రెడ్డి, కత్తి వెంకటస్వామి, బండి సుధాకర్ గౌడ్, లక్ష్మీనారాయణ నాయక్, నాయిని లక్ష్మారెడ్డి, బట్టి శ్రీనివాస్‌కు దక్కలేదు. పాలకుర్తి నుంచి కోడలు యశస్వినిరెడ్డిని బరిలో దింపి ఎమ్మెల్యేగా గెలిపించిన ఝాన్సీరెడ్డికి ప్రోటోకాల్ కోసం రాష్ట్ర స్థాయి పదవి ఈసారీ రాలేదు. దీంతో నిరాశకు గురైన సీనియర్లు, ఆశావహులు సీఎంరేవంత్ రెడ్డిని కలిసేందుకు సిద్ధం అవుతున్నారు.

'కుడా' చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట్రామ్‌రెడ్డి



నగరాన్ని బెస్ట్ సిటీగా చేయడమే ధ్యేయం

'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి

నయీంనగర్ : వరంగల్ నగరాన్ని బెస్ట్ సిటీగా తీర్చిదిద్దడమే ధ్యేయమని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. సోమవారం 'కుడా' చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కుడా' చైర్మన్ పదవి రావడానికి కృషి చేసిన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా మంత్రులు, ఉమ్మడి వరంగల్ ప్రజాప్రతినిధులు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన వెంకట్రామ్‌రెడ్డికి మేయర్ సుధారాణి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, 'కుడా' కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రాత్రి చోరీలు.. పగలు జల్సాలు

- దొంగల ముఠా అరెస్ట్
- ఎనిమిది విద్యుత్ మోటార్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న విద్యుత్ మోటార్లు

హసన్‌పర్తి : రాత్రి వేళ చోరీలకు పాల్పడుతూ.. పగలు జల్సా చేస్తున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు సోమవారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. నగరంలోని మడికొండకు చెందిన పత్రి రాజు, శ్రీపతి ప్రేమ్‌కుమార్, తూర్పాటి ఏసుకుమార్ గ్రామాలకు వెళ్లి పాత ఇనుప సామాను సేకరించే వారు. అయితే వచ్చిన డబ్బులతో జల్సాలు చేయడం ప్రారంభించారు. జల్సాలకు ఆ డబ్బులు సరిపడకపోవడంతో రాత్రి వేళ చోరీలకు తెరలేపారు. వృత్తిని వదిలిపెట్టి చోరీలకు పాల్పడ్డారు. ఈక్రమంలో వ్యవసాయ బావులకు ఉన్న మోటార్లు చోరీ చేసిన అనంతరం వాటిని విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సా చేసేవారు. ఈ క్రమంలో కేయూసీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు మోటార్లు తీసుకుని ద్విచక్రవాహనంతో వెళ్తూ పోలీసులకు చిక్కారు. అనుమానస్పదంగా ఉన్న వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలు అంగీకరించినట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరించారు. ఈ మేరకు ఎనిమిది మోటార్లతో పాటు ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ చెప్పారు. సమావేశంలో కేయూ సీఐ సంజీవ, సీసీఎస్ సీఐ అబ్బయ్య, ఎస్సైలు రాజ్‌కుమార్, దేవేందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, నిందితులు కేయూ పీఎస్ పరిధిలో రెండు, నల్లబెల్లి, దుగ్గొండి, చిల్పూరు, ఎల్కతుర్తి, సంగెం, స్టేషన్ ఘన్‌పూర్ మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున మోటార్లు చోరీ చేశారని ఏపీపీ తెలిపారు.

యాసిడ్ కలిపిన వాటర్ తాగి విద్యార్థినికి అస్వస్థత



హిందు

తరిగొప్పుల: యాసిడ్ కలిపిన వాటర్ తాగి విద్యార్థిని అస్వస్థతకు గురైన సంఘటన మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో చోటుచేసుకుంది. విద్యార్థిని తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంకుషాపూర్‌కు చెందిన శివరాత్రి హిందు స్థానిక కసూర్బాగాంధీ విద్యాలయంలో 8వ తరగతి చదువుతుంది. కాగా ఆదివారం సాయంత్రం వ్యాయామం చేసిన అనంతరం హిందు తన వాటర్‌బాటిల్‌లోని నీటిని తాగింది. అప్పటికే గుర్తుతెలియని వ్యక్తులు ఆ బాటిల్‌లో బాత్‌రూంలో వినియోగించే యాసిడ్‌ను కలిపారు. ఆ వాటర్ తాగిన విద్యార్థిని స్వల్ప అస్వస్థతకు గురైంది. విద్యార్థిని గ్రహించి పాఠశాల ప్రత్యేక అధికారికి తెలియజేయగా ఆమెను జనగామ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. అనంతరం విద్యార్థిని తల్లికి సమాచారం అందించి అప్పగించారు. తమ కూతురుకు సహచర విద్యార్థులకు ఎలాంటి గొడవలు లేవని తెలిపింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కారకులతో పాటు పాఠశాల ప్రత్యేక అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరింది.

నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిది



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కడియం, ఎంపీ కావ్య, చిత్రంలో గుడి వంశీధర్‌రెడ్డి, తదితరులు

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- ఘన్‌పూర్‌లో ఘనంగా కడియం జన్మదిన వేడుకలు

స్టేషన్‌ఘన్‌పూర్: 'ఎన్ని జన్మలు ఎత్తినా నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిది.. నేను, నా కుటుంబం జీవితాంతం నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటాం' అని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, కడియం శ్రీహరి అభిమానుల ఆధ్వర్యంలో సోమవారం కడియం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ డాక్టర్ కావ్య, ఎమ్మెల్యే కడియం హాజరయ్యారు. కడియం కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రజలు, కాంగ్రెస్‌పార్టీ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజల సహకారంతోనే తాను ఎమ్మెల్యేగా, కావ్య ఎంపీగా విజయం సాధించారన్నారు. తుదిశ్వాస వరకు నియోజకవర్గ ప్రజలతోనే ఉంటానని, సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ఎక్కువ నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, బూర్ల శంకర్, గుడి వంశీధర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, అన్నం బ్రహ్మారెడ్డి, మంతెన ఇంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రజాక్‌యాదవ్, పోశాల కృష్ణమూర్తి, తోట సత్యం, కనకం గణేశ్, కొలిపాక సతీశ్, తెల్లాకుల రామకృష్ణ, పద్మారెడ్డి, కిషన్‌రాజ్, గట్టు రమేశ్, చిగురు సరిత, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, చిల్పూరు శ్రీ బుగుల వెంకటేశ్వరస్వామి ఆలయంలో తన జన్మదినం సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

గేదెను కాపాడబోయి రైతు మృతి

- నారాయణపురంలో ఘటన



కరెంట్ షాక్‌తో మృతి చెందిన గేదె, స్వామి

బచ్చన్నపేట : కరెంట్ షాక్‌తో గేదె, ఆ మూగజీవాన్ని కాపాడబోయిన ఓ యువరైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని నారాయణపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జంగిటి స్వామి (32) తన పశువులను మేపడానికి రోజూమాదిరిగానే సోమవారం ఉదయం పోతులోని కుంట వద్దకు వెళ్లాడు. అక్కడ కరెంట్ స్తంభాలపై ఎల్‌టీ లైన్, కింద సరఫరా లేని తీగలు వేలాడుతున్నాయి. గతంలో పలుమార్లు ఆ కరెంట్ తీగలు పశువుల కొమ్ములకు చుట్టుకునేవి. మృతుడు స్వామి ఆ తీగలు విడిపించి పశువులను తోలుకుని వెళ్లేవాడు. ఈ క్రమంలో సోమవారం కూడా ఓ గేదె వేలాడుతున్న కరెంట్ తీగలను కొమ్ములకు చుట్టుకుని కొద్ది దూరం లాక్కొని వెళ్లింది. ఈ తీగలకు ఉన్న కాసారం వంగి పైన కరెంట్ సరఫరా ఉన్న తీగలకు తాకింది. దీంతో కరెంట్ సరఫరా అయి షాక్‌తో ఆ గేదె మృత్యువాత పడింది. దీనిని గమనించని రైతు స్వామి.. ఎప్పటి లాగే కరెంట్ తీగ గేదె చుట్టుకుందని భావించి విడిపించడానికి వెళ్లగా ఎర్త్ అయి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. స్వామి ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. ఘటనా స్థలికి ఎస్సై కంకల సతీష్‌కుమార్ చేరుకుని ప్రమాద తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వేలాడిన కరెంట్ తీగలను ట్రాన్స్‌కో అధికారులు తొలగించకపోవడంతోనే స్వామి మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు.

గేదె పొడిచి పశువుల కాపరి..



జనార్దన్ (ఫైల్)

రాయపర్తి(వర్ధన్నపేట): గేదె పొడవడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. వర్ధన్నపేట పట్టణానికి చెందిన తోట జనార్దన్ (59) పట్టణానికి చెందిన గుజ్జ సోమేశ్వర్‌రావు వద్ద పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. ఈనెల 6న గేదెలు మేపేందుకు వెళ్తుండగా ఓ గేదె.. జనార్దన్‌ను పొడిచింది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన జనార్దన్‌ను ఎంజీఎం తరలించగా చికిత్స చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.మృతుడి కుమార్తె దీప్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాణం తీసిన భూతగాదా..

- మాజీ సర్పంచ్ దారుణ హత్య
- బురహాన్‌పల్లిలో ఘటన



దేవేందర్ (ఫైల్)

రాయపర్తి: భూతగాదా.. ఒకరి ప్రాణం తీసింది. మాజీ సర్పంచ్ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బురహాన్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్(56) హనుమకొండలోని యాదవనగర్‌లో కుటుంబీకులతో కలిసి నివాసముంటున్నాడు. సర్పంచ్ పదవి ముగిసినా పలువురి గ్రామస్తుల సమస్యల పరిష్కారం కోసం గ్రామంలోనే ఒంటరిగా ఉంటున్నాడు. ఈక్రమంలో సోమవారం తెల్లవారుజామున తన ఇంట్లో ఒంటరిగా ఉన్న దేవేందర్‌ను గమనించిన దుండగులు సుత్తితో తలపై మోదీ దారుణంగా హత్య చేశారు. గ్రామంలో మూడెకరాల భూమి విషయంలో గ్రామానికి చెందిన పల్లె మల్లేశ్‌తో దేవేందర్‌కు కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఒకరికొకరు బాహాటంగానే చంపుతానని అనుకునేవారు. భూమి విషయంలో గతంలో పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. మాజీ సర్పంచ్ హత్యపై సమాచారం అందుకున్న వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. పోలీసు జాగిలం అనుమానాస్పద వ్యక్తి పల్లె మల్లేశ్ ఇంటికే వెళ్లి ఆగడంతో గ్రామంలో అతడిపైనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ హత్యలో పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు వెస్ట్‌జోన్ డీసీపీ తెలిపారు. కాగా, తమ తండ్రి దేవేందర్‌ను పల్లె మల్లేశ్, అతడి కుమారుడు మురళి హత్య చేశారని మృతుడి కుమారుడు నిఖిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. మాజీ సర్పంచ్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా, దారుణహత్యకు గురైన బురహాన్‌పల్లి మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్ మృతదేహాన్ని జరిపేందుకుగాను గ్రామానికి చెందిన బాలె కొమురయ్య(70)అధికారులకు సహకరించాడు. ఈ క్రమంలో రక్తమడుగులో ఉన్న మృతదేహాన్ని చూసిన కొమురయ్యకు విరేచనాలయ్యాయి. ఇంటికి వెళ్లిన అనంతరం మృతిచెందాడు.

సీఎస్‌సీలతో సహకార సంఘాలు బలోపేతం

- టీఎస్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



మాట్లాడుతున్న టీఎస్ కోఅపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్ రావు

హన్మకొండ: కామన్ సర్వీస్‌సెంటర్ (సీఎస్‌సీ) ల నిర్వహణతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు మరింత బలోపేతయవుతాయని టీఎస్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో బ్యాంకు పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ముఖ్య కార్యనిర్వహణాధికారులు, కంప్యూటర్ ఆపరేటర్‌లకు ఈగవర్నెన్స్ సర్వీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్ నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మార్నేని రవీందర్ రావు ప్రారంభించి మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక, వివిధ రకాల నోటిఫికేషన్‌లకు దరఖాస్తులు చేసుకోవడం, విద్యుత్, మున్సిపల్ ఇతర బిల్లులు చెల్లింపులన్నీ ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలో మీ సేవ కేంద్రాల్లో అందించే సేవలను ఇక నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా అందించి గ్రామీణులకు డిజిటల్, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ప్రధాన మంత్రి సంక్షేమ పథకాలు, ఆధార్ సేవలు, పాన్‌కార్డు, ఎలక్ట్రికల్ బిల్స్, ఇంటి, నీటి పన్ను చెల్లింపులు, ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్స్ ఫైలింగ్, పాస్‌పోర్టు సేవలు, మున్సిపల్ సర్వీసెస్, ఆర్‌టీఓ సేవలు, ఫాస్ట్ ట్యాగ్, రుణాలు, ఇన్సూరెన్స్, పెన్షన్‌తో పాటు అనేక రకాల సేవలు ఈ కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా అందించనున్నట్లు వివరించారు. కామన్ సర్వీస్ సెటర్ నిర్వహణను సక్రమంగా నిర్వహించాలని సహకార సంఘాల సీఈఓలు, కంప్యూటర్ ఆపరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ ఎం.డి.వజీర్ సుల్తాన్, జనరల్ మేనేజర్ ఉషశ్రీ, డీజీఎం అశోక్, ఈ గవర్నెన్స్ సీనియర్ మేనేజర్ హరికృష్ణ, డీసీసీబీ మేనేజర్లు మాధురి, అరుణ్ కుమార్, లావణ్య, పవన్, అనంత బాబురావు పాల్గొన్నారు.